క్లుప్తంగా

ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలి



డిచ్‌పల్లి: విధి నిర్వహణతో పాటు ప్రతి ఒక్కరూ వ్యక్తిగత ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలని టీఎస్‌ఎస్‌పీ 7వ బెటాలియన్ కమాండెంట్ ఎన్‌వీ సత్యశ్రీనివాసరావు సూచించారు. జిల్లా కేంద్రంలోని మెడికవర్ హాస్పిటల్, బెటాలియన్ యూనిట్ హాస్పిటల్ ఆధ్వర్యంలో బుధవారం ఆరోగ్య శిబిరం ఏర్పాటు చేశారు. బెటాలియన్ అధికారులు, సిబ్బందికి గుండె సంబంధిత వైద్యపరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి మందులు అందజేశారు. వైద్యులు, అసిస్టెంట్ కమాండెంట్స్ అంజనేయరెడ్డి, భాస్కర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

సీఈఐఆర్ పోర్టల్‌ను సద్వినియోగం చేసుకోవాలి



మోపాల్(నిజామాబాద్‌రూరల్): సీఈఐఆర్ పోర్టల్ ద్వారా ఎత్తుకెళ్లిన, పడిపోయిన ఫోన్ ఎక్కడ వినియోగిస్తున్నారో తెలుసుకోవచ్చని సీఐ సురేందర్‌రెడ్డి సూచించారు. మండలంలోని నర్సింగ్‌పల్లికి చెందిన చిన్నోళ్ల గంగారెడ్డికి ఫోన్‌ను బుధవారం అప్పగించారు. ఈసందర్భంగా సీఐ మాట్లాడుతూ.. చిన్నోళ్ల గంగారెడ్డి ఫోన్ పడిపోయిందని ఫిర్యాదు చేయడంతో సీఈఐఆర్ పోర్టల్ ద్వారా నమోదు చేశామని తెలిపారు. సెల్‌ఫోన్ నందిపేట్ దత్తాపూర్ గ్రామంలో గుర్తించామన్నారు. ఫోన్ రికవరీ చేసి గంగారెడ్డికి అప్పగించామని పేర్కొన్నారు. ఎస్‌ఐ మహేష్, పోలీస్ కానిస్టేబుల్ మూర్తి పాల్గొన్నారు.

మైనారిటీల సమస్యలను పరిష్కరించాలి



సిరికొండ: మైనారిటీలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని ఆర్టీసీ చైర్మన్, ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్‌ను వివిధ గ్రామాలకు చెందిన మైనార్టీ నాయకులు కోరారు. హైదరాబాద్‌లో ఎమ్మెల్యేను వారు బుధవారం కలిసి వినతిపత్రం అందచేశారు. మైనారిటీల సమస్యలను ఎమ్మెల్యేకు వివరించారు. నిధుల మంజూరుకు ఎమ్మెల్యే హామీఇచ్చారన్నారు.

‘మహిళా సమ్మాన్’ ప్రారంభం

సిరికొండ: కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌లో మహిళా సమ్మాన్ సేవింగ్స్ సర్టిఫికెట్ 2023 పథకం ప్రకటించిందని నిజామాబాద్ సౌత్ సబ్ డివిజన్ పోస్టల్ ఇన్‌స్పెక్టర్ సంతోష్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. మహిళలు, ఆడపిల్లలు ఆర్థికంగా నిలదొక్కుకోవడానికి కేంద్ర ప్రభుత్వం కొత్తగా ఈ మహిళా సమ్మాన్ పథకంను ప్రారంభించారన్నారు. 18 ఏళ్లు నిండిన మహిళలు, బాలికలు ఈ ఖాతాను ప్రారంభించవచ్చని తెలిపారు. ఈ ఖాతాలో కనిష్ఠంగా వెయ్యి నుంచి గరిష్ఠంగా రూ.రెండు లక్షల వరకు జమ చేసుకోవచ్చని, మూడు నెలల వ్యవధితో ఎన్ని ఖాతాలైన ప్రారంభించుకోవచ్చని తెలిపారు. ఖాతా కాల వ్యవధి రెండు సంవత్సరాలు అని, ఒక సంవత్సరం తర్వాత నలభై శాతం వరకు పాక్షికంగా ఉపసంహరించుకోవచ్చని తెలిపారు. ఈ ఖాతాతో ఎన్నో ప్రయోజనాలున్నాయని తెలిపారు.

బాపూజీ వచనాలయానికి పుస్తకాల విరాళం



నిజామాబాద్ నాగారం: నగర శివారులోని నాగారం కాలనీకి చెందిన కొటికలపూడి లక్ష్మీ ప్రసాద్ తన తండ్రి కొటికలపూడి మధుసూదన్ జ్ఞాపకార్థం రూ.40వేల విలువ చేసే 500 వివిధ రకాల పుస్తకాలను బాపూజీ వచనాలయానికి బుధవారం అందజేశారు. కార్యక్రమంలో లలిత, రాజశేఖర్, కమల, నవీన్ బిల్లా ఉన్నారు.

బీఎస్పీ అర్బన్ కమిటీని తొలగించే అధికారం జిల్లా కమిటీకి లేదు



నిజామాబాద్‌నాగారం: బీఎస్పీ అర్బన్ కమిటీని తొలగించే అధికారం జిల్లా కమిటీకి లేదని పార్టీ అర్బన్ ఇన్‌చార్జి నీరడి లక్ష్మణ్ తెలిపారు. నగరంలోని పార్టీ కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పార్టీ పేరును, పార్టీ ప్రతిష్ఠకు ఎక్కడ భంగం కలిగించలేదనిఅన్నారు. పార్టీ కోసం పని చేస్తున్న మాలాంటి వారిపై కుట్రలు మానుకోవాలని అన్నారు. షకీల్, రాజశేఖర్ ఉన్నారు.

బీటీ రోడ్డు పనుల్లో నాణ్యత ఏదీ?

- ఇష్టారాజ్యంగా రోడ్డు నిర్మాణ పనులు
- పట్టించుకోని అధికారులు





నగరంలోని గోశాల వద్ద బీటీ రోడ్డుకు ఇరువైపులా పోసిన డ్రైయినేజీ మట్టి

నిజామాబాద్‌నాగారం: నగరంలో రోడ్ల నాణ్యత అంతంత మాత్రంగానే ఉంది. పదికాలాలపాటు రోడ్లు మన్నికగా ఉండేలా పనులు చేయాల్సి ఉన్నా.. కాసులకు కక్కుర్తి పడి రోడ్ల నిర్మాణంలో నాణత్య ప్రమాణాలు పాటించడం లేదు. దీంతో రోడ్లు మూణ్నాళ్ల ముచ్చట అన్నచందంగా మారుతున్నాయి. అయినా అధికారులెవరూ పట్టించుకోకపోవడంపై ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

నగరంలో ఇదీ పరిస్థితి..

నిజామాబాద్‌లోని నాగారం గోశాల చౌరస్తా నుంచి సుమారు 500మీటర్ల దూరంలో బీటీ రోడ్డు పనులు చేపట్టారు. ఇందుకోసం రూ. 90లక్షల నిధులు కేటాయించారు. పనులు ఇటీవలే పూర్తి చేశారు. బీటీ రోడ్డుకు ఇరువైపూలా మొరంతో బలంగా ఉండేలా చూడాలి. అలా కాకుండా ఇటీవల డ్రెయినేజీ నిర్మాణం కోసం తవ్విన మట్టిని బీటీరోడ్డుకు ఇరువైపులా పోశారు. నాణ్యత ప్రమాణాలతో ఉండేలా నిర్మాణ పనులు పూర్తి చేయాల్సిన కాంట్రాక్టర్లు ఇలా ఇష్టారాజ్యాంగా వ్యవహరిస్తున్నారు.

పర్యవేక్షణ కరువు..

రోడ్డు నిర్మాణంలో పర్యవేక్షణ చేయాల్సిన అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు. దీంతో కాంట్రాక్టర్లు రోడ్డు నిర్మాణంలో నాణ్యత ప్రమాణాలు పాటించడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. తారు రోడ్డు వేశారన్నా సంతోషం 6 నెలలు కూడా ఉండదని, వచ్చే వర్షాకాలంలో ఏవిధంగా మారుతుందో ఇట్టే తెలిసిపోతుందని స్థానికులు చర్చించుకుంటున్నారు. సంబంధిత ఇంజనీరింగ్ అధికారులు సరైనా పర్యవేక్షణ లేకపోవడం వల్లే రోడ్డు నిర్మాణంలో నాణ్యత ప్రమాణాలు పాటించ లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డు నిర్మాణంలో నాణ్యత పాటించేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

చర్యలు తీసుకుంటాం..

రోడ్డు నిర్మాణంలో తప్పనిసరిగా నాణ్యత ప్రమాణాలు పాటించాల్సిందే. ఒకవేళ ఇష్టారాజ్యంగా పనులు చేపట్టినట్లు తెలిస్తే చర్యలు తీసుకుంటాం. బీటీ రోడ్డు నిర్మాణం విషయంలో మరొక్కసారి పరిశీలన చేస్తాం.

– శంకర్, మున్సిపల్ ఏఈ

బేషరతుగా క్షమాపణ చెప్పాలి



నగరంలోని ధర్నా చౌక్‌లో రాస్తారోకో నిర్వహిస్తున్న యాదవులు, గొల్లకుర్మలు

నిజామాబాద్‌నాగారం: యాదవ, కుర్మలతోపాటు, తెలంగాణ రైతాంగానికి, పాడిరైతులకు సబ్బండ వర్గాలకు మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్, టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి బేషరతుగా క్షమాపణ చెప్పలని బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకులు రాజారాం యాదవ్ పేర్కొన్నారు. ఈమేరకు నగరంలోని పాత కలెక్టరేట్ ఎన్టీఆర్ చౌరస్తాలో బుధవారం యాదవ, కుర్మ జేఏసీ ఆధ్వర్యంలో జిల్లా అధ్యక్షుడు మహిపాల్‌యాదవ్ అధ్యక్షతన ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా రాజారాం యాదవ్ మాట్లాడుతూ.. తలసాని శ్రీనివాస్‌యాదవ్, రేవంత్‌రెడ్డిలు యాదవ, కుర్మలను, తెలంగాణ రైతాంగాన్ని కించపరిచే విధంగా వారి ఆత్మగౌరవాన్ని దెబ్బతీసే విధంగా మాట్లాడడం దురదృష్టకరమన్నారు. వ్యవసాయాన్ని, మట్టిని, పేడను కించపరచడమంటే సమస్త శ్రామికవర్గాన్ని, రైతాంగాన్ని విమర్శించడమేనన్నారు. రాష్ట్ర నాయకులు కడాల అంజయ్య, గోస శ్రీనివాస్‌యాదవ్, గోవర్ధన్‌యాదవ్, రాములు యాదవ్, రాజన్న యాదవ్, ప్రధాన కార్యదర్శి రాగి రాజేందర్ యాదవ్, కన్వీనర్ బాబురావు యాదవ్, వర్కింగ్ ప్రెసిడెంట్ లింగం యాదవ్, రజిత ఎల్లన్న పాల్గొన్నారు.

ముగిసిన సీఎం కప్‌పోటీలు





ఇందల్వాయిలో విజేతలకు బహుమతులు అందజేస్తున్న ప్రజాప్రతినిధులు.. మల్లారంలో..

ఇందల్వాయి: మండలకేంద్రలో బుధవారం మండల స్థాయి సీఎం కప్ పోటీలు ముగిశాయి. ఈసందర్భంగా వివిధ పోటీల్లో ప్రతిభ చూపిన క్రీడాకారులకు మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ రమేష్‌నాయక్, ఎంపీడీవో రాములునాయక్, తహసీల్దార్ రోజాతో కలిసి బహుమతులు అందజేశారు. కబడ్డీలో విజేత మేగ్యానాయక్‌తండా నిలవగా, రన్నరప్ ఎల్లారెడ్డిపల్లి జట్టు నిలిచింది. వాలీబాల్‌లో గన్నారం మొదటిస్థానంలో నిలవగా, మేగ్యానాయక్‌తండా రెండో స్థానంలో నిలిచింది. ఖోఖోలో ఇందల్వాయి జట్టు ప్రథమ స్థానం సాధించగా, ఎల్లారెడ్డిపల్లి జట్టు ద్వితీయ స్థానం పొందింది. ఉత్తమ ప్రతిభ కనబరిచినవారిని జిల్లా స్థాయి జట్లకు ఎంపిక చేసినట్లు పీఈటీ రాజ్‌కుమార్ తెలిపారు.

నిజామాబాద్ సిటీ: నిజామాబాద్ రూరల్ మండలం మల్లారం గ్రామంలో జరుగుతున్న సీఎం కప్ పోటీలు బుధవారం ముగిశాయి. విజేతలుగా కబడ్డీ పోటీలో మల్లారం, వాలీబాల్ మల్కాపూర్ తండా, ఖోఖోలో మల్లారం జట్లు గెలుపొందాయి. అలాగే రన్నింగ్ పోటీలో నిజామాబాద్‌కు చెందిన శ్రీకాంత్ విజేతగా నిలిచారు. విజేతలకు ఎంపీడీవో మల్లేష్, వైస్ ఎంపీపీ అన్నం సాయిలు, సర్పంచ్ నగేష్ మెమోంట్‌లు ప్రదానం చేశారు.

మోపాల్(నిజామాబాద్‌రూరల్): మండలకేంద్రంలోని జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో సీఎంకప్ పోటీలు ఒక్కరోజులోనే ముగించారు. కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు ప్రదానంచేశారు.

అధిక ఫీజుల వసూళ్లను అరికట్టండి



నిరసన తెలుపుతున్న విద్యార్థి సంఘాల నేతలు

నిజామాబాద్‌అర్బన్: కేవలం ర్యాంకుల మార్కుల పేరుతో విద్యార్థులను, వారి తల్లిదండ్రులను మోసం చేస్తూ రూ. లక్షల ఫీజులు వసూలు చేస్తున్న ఆకాష్, ఇతర కార్పొరేట్ విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని, అధిక ఫీజుల వసూళ్లను అరికట్టాలని విద్యార్థి సంఘాల జేఏసీ ప్రతినిధులు డిమాండ్ చేశారు. ఈమేరకు బుధవారం నగరంలో విద్యార్థి సంఘాల జేఏసీ ప్రతినిధులు నిరసన చేపట్టారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. కార్పొరేట్ విద్యాసంస్థల్లో కేవలం ఫీజులను దోపిడీ చేయడమే లక్ష్యంగా నడిపిస్తున్నా.. విద్యాశాఖ అధికారులు ఏమాత్రం చర్యలు చేపట్టకుండా ఉండడం సరైంది కాదన్నారు. అధికారులు స్పందించి కార్పొరేట్ విద్యాలయాల్లో కొనసాగుతున్న ఫీజుల దోపిడీని అరికట్టాలని, అదేవిధంగా ప్రతి విద్యాలయాల్లో ప్రభుత్వం ఆదేశించినట్లుగా 25శాతం మంది విద్యార్థులకు ఉచిత విద్యను అందించాలని అన్నారు. నాయకులు నరేందర్, గణేష్, రఘురాం, విగ్నేష్, అనిల్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

నియామకం...



నిజామాబాద్‌నాగారం: బీసీ మహిళ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులుగా పట్టేపురం వీణాగౌడ్‌ను జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్ కృష్ణయ్య నియమించారు. ఈ మేరకు జిల్లా అధ్యక్షుడు కొండవీటీ శ్యామ్ ప్రసాద్ బుధవారం ప్రెస్‌క్లబ్‌లో నియమకపత్రాన్ని అందజేశారు. బీసీ మహిళ రాష్ట్ర అధికార ప్రతినిధి గంట జ్యోతి, రాష్ట్రకార్యదర్శి అరుణజ్యోతి, రవి, ప్రభాకర్, రుక్మాజీ, ముత్తెన్న తదితరులు పాల్గొన్నారు.

బ్రాహ్మణ ఐక్యత కోసమే ప్రభుత్వం కృషి



నిజామాబాద్‌నాగారం: బ్రాహ్మణ సంక్షేమం ఐక్యత కోసమే రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని బ్రాహ్మణ సంక్షేమ సంఘం గౌరవ అధ్యక్షుడు కంచ్కర భూపతిరావు పేర్కొన్నారు. హైదరాబాద్‌లో బుధవారం తెలంగాణ బ్రాహ్మణ సంక్షేమ పరిషత్ అధ్యక్షుడుగా డా. కెవి రమణచారి అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ ఈ నెల 31న గొల్లపల్లిలో ఆరు ఎకరాల సువిశాల స్థలంలో నిర్మించిన బ్రాహ్మణ సంక్షేమ భవనంను ఆరంభిస్తారని తెలిపారు. ఉమ్మడి నిజామాబాద్ జిల్లా నుంచి బ్రాహ్మణ సోదరసోదరీమణులు హాజరు కావాలని కోరారు.

పెండింగ్ బిల్లులను విడుదల చేయాలి



ఖలీల్‌వాడి: మధ్యాహ్న భోజన కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వం పెంచిన రూ. 3000 గౌరవ వేతనం పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేయాలని మధ్యాహ్న భోజన పథకం కార్మికుల యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్వీ రమ డిమాండ్ చేశారు. నగరంలోని సీఐటీయూ కార్యాలయంలో బుధవారం జిల్లా అధ్యక్షురాలు చామంతి లక్ష్మి అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా రమ మాట్లాడుతూ.. కార్మికుల సమస్యలపై ప్రభుత్వం స్పందించకపోతే రాష్ట్రవ్యాప్త ఉద్యమాన్ని చేపడతామని హెచ్చరించారు. జిల్లా కార్యదర్శి నూర్జహాన్, ఉపాధ్యక్షులు మల్యాల గోవర్ధన్, యూనియన్ నాయకులు కొండ గంగాధర్, సుజాత, నిరంజన, బాలరాజు, శిరీష, సురేందర్ రెడ్డి, పర్వవ్వ, తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా పాలిసెట్ పరీక్ష



నగరంలోని ఓ పరీక్ష కేంద్రం వద్ద బారులు తీరిన విద్యార్థులు

నిజామాబాద్‌అర్బన్: జిల్లా కేంద్రంలో బుధవారం పాలిసెట్–2023 ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా జరిగింది. పరీక్షకు 5856 మంది దరఖాస్తు చేసుకోగా 5510 మంది పరీక్షకు హాజరయ్యారు. ఉదయం 11.గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు పరీక్ష జరిగింది. జిల్లా కేంద్రంలో 16 పరీక్ష కేంద్రాలను అధికారులు ఏర్పాటు చేశారు.





హాల్‌టికెట్ నంబర్లను చూసుకుంటున్న అభ్యర్థులు.. పరీక్ష కేంద్రానికి వెళుతున్న విద్యార్థినులు

జీజీహెచ్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



వినతిపత్రం అందజేస్తున్న ఏఐటీయూసీ నేతలు

నిజామాబాద్ సిటీ: నిజామాబాద్ ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిని 1000 పడకల ఆస్పత్రిగా పెంచాలని, ఆస్పత్రిలోని కార్మికుల సమస్యలను పరిష్కరించాలని ఏఐటీయూసీ నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు వారు బుధవారం కార్మికులతో కలిసి ఆస్పత్రి ముందు ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా తెలంగాణ మెడికల్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ)రాష్ట్ర కార్యదర్శి ఓమయ్య మాట్లాడుతూ.. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రి ప్రస్తుతం 615 పడకలు ఉన్నప్పటికీ నిజామాబాద్ జిల్లాతో పాటు కామారెడ్డి, నిర్మల్, ఆదిలాబాద్ జిల్లాలు, మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాల సరిహద్దు ప్రాంతాల ప్రజలు జీజీహెచ్‌కు రావటంతో ఓపీ, ఐపీ సేవలు పెరిగయన్నారు. దీంతో సిబ్బందిపై పని భారం ఎంతో పెరిగిందన్నారు. కావున ఆస్పత్రిని 1000 పడకలకు పెంచి, సిబ్బంది సంఖ్యను పెంచాల్సిందిగా ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. యూనియన్ జిల్లా అధ్యక్షుడు సుధాకర్ మాట్లాడుతూ.. ఆస్పత్రి కార్మికుల సమస్యలను పరిష్కరించాలన్నారు. అనంతరం జీజీహెచ్ సూపరింటెండెంట్ ప్రతిమా రాజ్‌కు వినతిపత్రం ఇచ్చారు. యూనియన్ ప్రతినిధులు భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న వీవోఏల సమ్మె



సిరికొండ: మండలంలో వీవోఏల సమ్మె బుధవారం 24వ రోజుకు చేరింది. ఈసందర్భంగా వీవోఏలు మాట్లాడుతూ.. ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పందన లేకపోవడం బాధకరమన్నారు. సంఘం మండలాధ్యక్షుడు మూన్‌సింగ్, వర్కింగ్ ప్రెసిడెంట్ స్వామి, లలిత, కవిత, వినోద్, వర్ణ, లక్ష్మీ, సునీత, రాంచందర్ పాల్గొన్నారు.

కాంట్రాక్టు అధ్యాపకులను రెగ్యులరైజ్ చేయాలి

తెయూ(డిచ్‌పల్లి): రాష్ట్రంలోని 12 యూనివర్సిటీల్లో పని చేస్తున్న కాంట్రాక్టు అధ్యాపకులందరినీ వెంటనే అసిస్టెంట్ ప్రొఫెసర్లుగా రెగ్యులరైజ్ చేయాలని తెయూ కాంట్రాక్టు అధ్యాపకులు డిమాండ్ చేశారు. ఈమేరకు బుధవారం వారు తెయూ ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజ్ వద్ద ధర్నా నిర్వహించారు. రాష్ట్ర జేఏసీ పిలుపులో భాగంగా గురువారం వినూత్న నిరసన నిర్వహిస్తామని తెలిపారు.

బంగారం ధరలు (10గ్రాములు)

24 క్యారెట్స్	62,400	వెండి (కిలో)	75,800
22 క్యారెట్స్	57,350	– నిజామాబాద్ బిజినెస్	

కూరగాయల ధరలు (రూ.)

	హోల్‌సేల్	రిటైల్		హోల్‌సేల్	రిటైల్
టమాట	6	12	క్యాప్సికం	30	50
బెండకాయ	20	40	గాజరుగడ్డ	25	40
బీరకాయ	40	60	పచ్చిమిర్చి	35	50
దొండకాయ	20	40	దోసకాయ	15	30
బీర్నీసుకాయ	70	90	ఆలుగడ్డ	15	30
కాకరకాయ	30	50	గోబిగడ్డ	10	20
వంకాయ	50	70	గోబిపువ్వు	20	40
పాలకూర	40	60	బీట్‌రూట్	20	40
మెంతికూర	40	60	గోరు చిక్కుడు	40	60
కొత్తిమీర	40	60	చిక్కుడుకాయ	50	70
పుదీనా	30	50			

– ఇందూరు

మాంసం ధరలు (రూ.)

చికెన్	ధరలు (కిలోకు)	డ్రెస్డ్	220
		లైవ్	180
స్కిన్‌లెస్	260	మటన్	750

వెండితెర తెలుగు/హిందీ/ఇంగ్లిష్



ఉషా ప్రసాద్ మల్టీప్లెక్స్ (గీతా ఏపియన్)

స్క్రీన్–1– అన్నీ మంచి శకునములే–10.30 1.30, 4.30,7.30 ,10.30
స్క్రీన్–2– కేరళ స్టోరీ(తెలుగు)– 10.40,10.40
కస్టడీ –1.35,7.40
విరూపాక్ష –4.40
స్క్రీన్–3 – ఫస్ట్ ఎక్స్(ఇంగ్లీష్)3డీ–10.25,1.20,4.15,10.15
ఫస్ట్ ఎక్స్(తెలుగు)3డీ–7.15

పీవీఆర్ మల్టీప్లెక్స్ (వేణు మాల్)

స్క్రీన్–1– ఫస్ట్ ఎక్స్(ఇంగ్లీష్) 3డీ –10.30 1.30,4.30,7.30 ,10.30
స్క్రీన్–2– 3డీ–గార్డియన్స్ ఆఫ్(ఇంగ్లీష్) –3.30
ది కేరళ స్టోరీ(హిందీ)–9.45
స్క్రీన్–3– ది కేరళ స్టోరీ(తెలుగు)– 10.20,7.10
ది కేరళ స్టోరీ(హిందీ)–1.00
ఉగ్రం–4.00
పొన్నియిన్ సెల్వన్ భాగం–2 –10.10
స్క్రీన్–4– కస్టడీ –12.25,6.50
అన్నీ మంచి శకునములే –3.35, 10.00

దేవి – కస్టడీ
నటరాజ్ – ఫస్ట్ ఎక్స్(తెలుగు)
లలితామహల్ – అన్నీ మంచి శకునములే
విజయ్ – విరూపాక్ష

సంక్షిప్తం

పెట్రోల్ బంక్ ప్రారంభం

నిజామాబాద్ సిటీ: నిజామాబాద్ రూరల్ మండలం శ్రీనగర్ గ్రామ శివారులో ఏర్పాటు చేసిన గణేష్ ఫిల్లింగ్ స్టేషన్‌ను బుధవారం జెడ్పీ ఆర్థిక ప్రణాళిక సంఘం సభ్యుడు, ఒలంపిక్ సంఘం ఉపాధ్యక్షుడు బాజిరెడ్డి జగన్ ప్రారంభించారు. సర్పంచ్ సురేందర్, బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

ధర్పల్లి: ధర్పల్లికి చెందిన సీనియర్ నాయకులు శ్రీశైలం ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా, బీజేపీ కార్యకర్త శ్రీనివాస్ తండ్రి అనారోగ్యంతో మృతి చెందాడు. దీంతో బాధిత కుటుంబాలను బుధవారం బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు యెండల లక్ష్మీనారాయణ పరామర్శించారు.

అనారోగ్యంతో వీఆర్‌ఏ మృతి

ఇందల్వాయి: మండలంలోని త్రయంబక్‌పేట్ వీఆర్‌ఏ నీరడి బాల్‌రాజ్(55) బుధవారం అనారోగ్యంతో మృతిచెందారు. అంత్యక్రియల్లో పాల్గొన్న మండల వీఆర్‌ఏల సంఘం ప్రతినిధులు అంత్యక్రియల నిమిత్తం ఆర్థికసాయం అందజేసినట్లు మండలాధ్యక్షుడు సాయన్న తెలిపారు.

చలివేంద్రం ప్రారంభం




నిజామాబాద్‌నాగారం: నగరంలోని దేవిరోడ్డులో బుధవారం వాసవి క్లబ్ నిజామాబాద్ ఆధ్వర్యంలో అధ్యక్షులు యెర్ర ప్రవీణ్ చలివేంద్రంను ప్రారంభించారు. కార్యదర్శి కూన దయానంద్, ట్రెజరర్ కొవ్వూరి దిగంబర్, కన్వీనర్ రాజప్రతాప్, పోకల శ్రీనివాస్, ప్రమోద్, మారుతి, రజనీకాంత్, రాజు, ప్రవీన్, ఈశ్వర్, రాము, పోచయ్య, శివాజీ, రాజు, యశ్వంత్, క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

21న అర్హత పరీక్ష

నిజామాబాద్‌అర్బన్: ఎస్సీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత శిక్షణ కోసం అర్హులను ఎంపిక చేసేందుకు ఈనెల 21న రాత పరీక్ష నిర్వహించనున్నట్లు ఎస్సీ సంక్షేమ శాఖ అభివృద్ధి అధికారిని శశికళ ఒక ప్రకటనలో తెలిపారు. కేర్ డిగ్రీ కళాశాలలో ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు పరీక్ష నిర్వహిస్తామన్నారు. అభ్యర్థులు హాల్ టికెట్లను డౌన్లోడ్ చేసుకోవాలన్నారు. వివరాలకు 040–2354652 నెంబర్‌ను సంప్రదించాలన్నారు.

సాయిబాబుకు ‘ఎన్టీఆర్ పురస్కారం’



నిజామాబాద్ సిటీ: తెలుగువెలుగు ఆధ్వర్యంలో ఇందూరు యువత స్వచ్ఛంద సేవాసంస్థ కార్యాలయంలో బుధవారం ఎన్టీఆర్ స్మారక పురస్కార సభ నిర్వహించారు. ఎన్టీఆర్ జయంతి సందర్భంగా తెలుగు వెలుగు సాంస్కృతిక సమాఖ్య సంస్థ మద్దుకూరి సాయిబాబుకు ఎన్టీఆర్ స్మారక సాహితీ సామాజిక సేవా పురస్కారాన్ని అందజేశారు. ఇందూరు యువత సంస్థ గౌరవ అధ్యక్షుడు దారం గంగాధర్, కవి నరేశ్‌రావు, సంస్థ బాధ్యులు పాల్గొన్నారు.